రాజకీయ వేడి





గెలుపు ధీమాపై లెక్కలేసుకుంటున్న నేతలు | త్రిముఖ పోటీ తప్పదంటున్న విశ్లేషకులు

సనత్‌నగర్: ప్రతిపక్షాలు ఇంకా అభ్యర్థులను ప్రకటించకముందే సనత్‌నగర్‌లో రాజకీయ 'వే'డీ' రాజుకుంది. అన్ని పార్టీల నేతలు ప్రజాక్షేత్రంలో తిరుగుతూ ఓటరు దేవుళ్ల చూపు తమపై పడేలా విశ్వప్రయత్నాలు చేసుకుంటున్నారు. అధికార పార్టీ ముందుగానే బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రకటనతో సనత్‌నగర్ ఎమ్మెల్యే, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అభివృద్ధి కార్యక్రమాలు, పాదయాత్రలు, సమావేశాల పేరిట నియోజకవర్గాన్ని ఇప్పటికే పలుమార్లు చుట్టేశారు. ఈ క్రమంలో ప్రచారపర్వంలో ఆయన ముందువరుసలో ఉన్నారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను హ్యాట్రిక్ కొట్టేలా చేస్తాయనే ధీమాతో ఉన్నారు. ఇదిలా ఉంటే టికెట్ ఖరారు కాకముందే కాంగ్రెస్, బీజేపీ నేతలు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌పై కాలు దువ్వుతున్నారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి బూస్ట్ ఇచ్చాయనేది సుస్పష్టం. దీనికి తోడు ఆరు గ్యారెంటీ హామీలను గడప గడపకూ తీసుకెళ్లడంలో ఆ పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్న డాక్టర్ రవీందర్‌గౌడ్, కోట నీలిమా, మర్రి ఆదిత్యారెడ్డి విశేష కృషి చేస్తూ వస్తున్నారు. గత అసెంబ్లీ, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఎదురుదెబ్బ తిన్న ఆ పార్టీకి మళ్లీ జవసత్వాలు చేకూరాయనేది రాజకీయ విశ్లేషకుల అంచనా.

కీలకంగా మారనున్న ముస్లిం ఓట్లు..

ఇప్పటివరకు ముస్లిం మైనార్టీల ఓటు బ్యాంక్ బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఉంటూ వస్తుండగా ఈ సారి కాంగ్రెస్‌కు ఎంతో కొంత బదిలీ అవుతుందనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఇక జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో నియోజకవర్గంలో మూడు కార్పొరేటర్ స్థానాలను దక్కించుకున్న బీజేపీ మంచి ఊపు మీద ఉంది. ఈ ఎన్నికల్లో ఓట్ల శాతాన్ని పరిశీలిస్తే అధికార పార్టీకి దీటుగా సాధించింది. దీనికి తోడు పార్లమెంట్ ఎన్నికల్లో సైతం నియోజకవర్గం నుంచి ఆ పార్టీకి ఓట్ల శాతం భారీగానే ఉంది. బీజేపీ నుంచి అరడజను మంది వరకు టికెట్ ఆశిస్తున్నప్పటికీ వారిలో ఎవరికిచ్చినా అధిష్ఠాన నిర్ణయాన్ని ఆ పార్టీ నేతలు గౌరవించి మద్దతుగా నిలుస్తారనే సంప్రదాయం ఉండనే ఉంది. ఈ పరిణామాలన్నీ బీజేపీ ఓటు బ్యాంక్‌ను చెక్కు చెదరనీయకుండా చేస్తాయనేది ఆ పార్టీ నేతల వాదన. నియోజకవర్గంలో 40,000 వరకు ముస్లిం ఓటర్లు ఉంటారనేది అంచనా. అది బీజేపీకి వ్యతిరేక ఓటుగా పరిగణిస్తున్నప్పటికీ ఇప్పటి వరకు అధికార పార్టీకి సంప్రదాయ ఓటుగా ఉన్న ముస్లిం ఓట్లను ఈ సారి కాంగ్రెస్ ఎంతో కొంత కొల్లగొడుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ముస్లిం ఓటు బ్యాంక్‌ను కాంగ్రెస్‌ను ఎంతగా చీల్చగలిగితే అధికార పార్టీకి నష్టం జరిగి తాము బయటపడతామనే ధీమాతో బీజేపీ నేతలు ఉన్నారు. మొత్తానికి సనత్‌నగర్ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ తప్పదనే స్పష్టంగా కనిపిస్తోంది.

నేతల కదలికలపై అడుగడుగునా నిఘా..

ఎన్నికల 'కోడ్' కూసింది దరిమిలా నేతలపై డేగ కళ్లు నిఘా పెట్టాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇప్పటికే పలు బృందాలు రంగంలోకి దిగాయి. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఈఆర్‌ఓ) కిషన్‌రావు ఆయా బృందాలకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రాజకీయ నేతలు చేసే ప్రయత్నాలకు అడ్డుకట్టవేసేందుకు నిత్య పర్యవేక్షణ జరపనున్నాయి. సనత్‌నగర్ నియోజకవర్గంలో 4 ఫ్లయింగ్ స్క్వాడ్, 4 స్టాటిక్ సర్వైలెన్స్, 3 వీడియో సర్వైలెన్స్, 3 వీడియో వ్యూయింగ్, 3 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ వంటి ఐదు రకాల బృందాలు ఎన్నికల వరకు పనిచేయనున్నాయి. అభ్యర్థుల ప్రచార శైలి, పార్టీల వ్యయం, సమావేశాలు, సభలు, డబ్బు పంపిణీ తదితర వాటిపై నిఘా ఉంచుతారు. షిఫ్టుల పద్ధతిలో ఫ్లయింగ్ స్క్వాడ్ నియోజకవర్గ వ్యాప్తంగా తిరుగుతూ రాజకీయ నేతలు కోడ్ పాటిస్తున్నారా లేదా? అని క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఈ క్రమంలో సరిహద్దుల్లో చెక్‌పోస్టుల వద్ద స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు నిఘా ఉంటారు. వీరు నిబంధనలకు మించి నగదు తరలింపుపై దృష్టి సారిస్తారు. రాజకీయ నేతల ప్రచార సరళి, సమావేశాలు, ర్యాలీలు తదితర అంశాలను ఎప్పటికప్పుడు వీడియో తీసి ఎన్నికల అధికారులకు పంపించే విధులను వీడియో సర్వైలెన్స్ టీమ్ చేపడుతుంది. ఇలా తీసిన వీడియోల ఆధారంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘనను గుర్తించే పనిలో వీడియో వ్యూయింగ్ టీమ్ నిమగ్నమై ఉంటుంది.

జంగ్ తెలంగాణ 2023

అభివృద్ధి పనులే గెలిపిస్తాయి



మాట్లాడుతున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే తనను గెలిపిస్తాయని బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఆరు డివిజన్లకు చెందిన ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఎవరూ ఊహించని రీతిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. అనేక కాలనీలు, బస్తీలే కాకుండా ఇతర ప్రాంతాల్లో కూడా పలు అభివృద్ధి పనులు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్లు లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరిశ్రీహరి, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, అరుణగౌడ్, మల్లికార్జున్‌గౌడ్, నాయకులు కొలను బాల్‌రెడ్డి, హరికృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, సురేష్‌గౌడ్, శ్రీహరి, మహేష్, శ్రీకాంత్‌రెడ్డి, ఖలీల్‌బేగ్, శేఖర్, ప్రేమ్, అబ్బాస్, రజాక్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

వెస్ట్‌మారేడ్‌పల్లిలోని మంత్రి నివాసంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి మంత్రి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. మాజీ కార్పొరేటర్ మల్లికార్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎస్‌ఆర్‌టీకి చెందిన బీజేపీ నాయకులు మతీన్ మురళి, హీరాలాల్, ఉమర్, ఐడీహెచ్ కాలనీకి చెందిన అంగమోతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీకి చెందిన మాలవి, సంతోష్, కన్నాతో పాటు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు.

కాంగ్రెస్ అధికారంతోనే సామాజిక న్యాయం



పాటిగడ్డలో పర్యటించిన కోట నీలిమా

సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంతోనే సామాజిక న్యాయం జరుగుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమా అన్నారు. ఇంటింటికీ ఆరు గ్యారెంటీ హామీల ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం బేగంపేట డివిజన్ పరిధిలోని పాటిగడ్డ, ఎస్‌బీటీనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఆరు గ్యారెంటీ హామీలతో కూడిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నీలిమా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీం పటేల్, బబ్లూ, నవాజ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

రాంగోపాల్‌పేట్: యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సికింద్రాబాద్‌లోని మహబూబ్ కళాశాల ఆడిటోరియంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు అలరించాయి. అలాగే సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సివిల్ కోర్టు కార్యదర్శి కళార్చన పాల్గొని బాలికల విద్య గురించి వివరించారు. బాలబాలికల పట్ల ఎలాంటి వివక్ష చూపరాదని మహిళలు చదువు కుంటేనే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. అడ్వొకేట్ సుభాషిణి, కళాశాల ప్రిన్సిపాల్ పురుషోత్తం, కార్యదర్శి భగవత్ వారణాసి పాల్గొన్నారు.

జాతీయ సదస్సు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మైక్రోబయోలజీ విభాగం జాతీయ సదస్సు ప్రారంభమైంది. బుధవారం ఓయూ దూరవిద్య ఆడిటోరియంలో పోస్ట్ పాండమిక్ సినారియో ఇంపెండింగ్ వైరల్ రీసెర్చ్ అనే అంశం పై జరిగిన జాతీయ సదస్సుకు మైక్రో బయోలజీ విభాగం హెడ్, సీఎఫ్‌ఆర్డీ డైరెక్టర్ ప్రొ.బుర్గుల సందీప్త అధ్యక్షత వహించగా ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి సదస్సులతో విషయ పరిజ్ఞానం పెరిగి నూతన ఆలోచనలు చేకూరుతాయన్నారు. ప్రొ.నాగమణి, డాక్టర హమీదాబీ, డా.శాంతికుమారి, ప్రొ.గోపాల్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి

రాంగోపాల్‌పేట్: వికలాంగుల, ఆర్థిక, సామాజికంగా మరింత ముందుకు వెళ్లేందుకు తన వంతు కృషిని కొనసాగిస్తానని ఇన్‌క్లూసివ్ దివ్యాంగజన్ ఎంట్రప్రెన్యూర్ అసోసియేషన్ (ఐడియా) వ్యవస్థాపకులు మల్లికార్జున అన్నారు. వికలాంగుల కోసం ఐడియా సంస్థ ద్వారా చేస్తున్న కృషిని గుర్తించి మల్లికార్జునకు ఇటీవల ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఈ అవార్డు తనపై బాధ్యతను పెంచిందని, మరింత సేవ చేసేందుకు దోహదపడుతుందన్నారు. వికలాంగుల్లో ఆత్మవిశ్వాసం, స్ఫూర్తిని నింపడం, వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవసరమైన శిక్షణ, ప్రోత్సాహం అందించి ముందుకు నడిపిస్తానన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న ఇనుముల నర్సయ్య

బౌద్ధనగర్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసంఉద్యమించాలని ఎంఎస్పీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఇనుముల నర్సయ్య పిలుపునిచ్చారు. పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ సికింద్రాబాద్ కోఆర్డినేటర్ డప్పు మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన ఎంఎస్పీ ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల అత్యవసర సమావేశంలో నర్సయ్య పాల్గొని మాట్లాడారు. మాదిగలను పోరాటానికి సన్నద్ధం చేయడం కోసం హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు నేటి నుంచి పాదయాత్రలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మందకృష్ణ మాదిగ పాదయాత్ర చేస్తూ లక్షల మందిని యుద్ధానికి సన్నద్ధం చేస్తున్నాడని పేర్కొన్నారు. యాత్రకు సంఘీభావంగా పాలకుల మీద మరింత ఒత్తిడి తేవడం, వర్గీకరణ సాధన కోసం మాదిగ, మాదిగ ఉపకులాల యుద్ధాన్ని తీవ్రతరం చేయడం కోసం ప్రతీ నియోజకవర్గంలో పాదయాత్రలకు సిద్ధం కావాలన్నారు. త్వరలో నిర్వహించబోయే విశ్వరూప మహాసభను విజయవంతం చేయడానికి కలిసికట్టుగా శ్రమించాలని పిలుపునిచ్చారు. నాయకులు సోమశేఖర్, షణ్ముకరావు, సామ్యూల్, ఉపేంద్ర, భూషపాక గణేష్, కొమ్ము శేఖర్, మహేష్, రామకృష్ణ, శివ, ప్రసాద్ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగింపు

21 మందిపై కేసు

చిలకలగూడ: చిలకలగూడ ప్రధాన రహదారిలోని ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించి 21 మందిపై కేసులు నమోదు చేశారు. చిలకలగూడ గాంధీ విగ్రహం, శివ టీ పాయింట్, అమర్ టాకీస్‌గల్లీ, కట్టమైసమ్మ ఆలయం తదితర ప్రాంతాల్లో కొంతమంది చిరువ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమై ప్రమాదాలు జరుగుతున్నట్లు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ కరుణాకర్ నేతృత్వంలో బుధవారం ఆపరేషన్ రోప్ పేరిట స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన 21 మందిపై కేసులు నమోదు చేసి ఆక్రమణలను తొలగించారు. చిలకలగూడ, మైలార్‌గడ్డ, సీతాఫల్ మండి చౌరస్తా, నామాలగుండు, శివాజీ విగ్రహం, వారాసిగూడ చౌరస్తాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలకు గురైనట్లు ఫిర్యాదులు అందాయని, త్వరలోనే స్పెషల్ డ్రైవ్ చేపడతామని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

కిమ్స్ వైద్యుల అరుదైన చికిత్స



తల్లిబిడ్డలతో డాక్టర్ వసుంధర చీపురుపల్లి

రాంగోపాల్‌పేట్: గర్భస్రావం జరిగి తీవ్ర రక్తస్రావమై, అస్వస్థతకు గురైన ఓ మహిళకు చికిత్సను అందించడంతో పాటు నాలుగేళ్ల తర్వాత మళ్లీ గర్భం దాల్చేలా చికిత్స అందించి సుఖమైన ప్రసవం చేశారు సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి వైద్యులు. అందుకు సంబంధించిన వివరాలను డాక్టర్ వసుంధర చీపురుపల్లి వెల్లడించారు. నాలుగేళ్ల క్రితం సోనాల్ అనే మహిళ గర్భస్రావం అనంతరం సమస్యలతో సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి వచ్చారు. అప్పటికే ఆమెకు డీ అండ్‌సీ చేయడంతో తీవ్రంగా రక్తస్రావం కావడంతో వివిధ పరీక్షలు నిర్వహించగా గర్భసంచి నుంచి రక్తం సరఫరా చేసే రక్తనాళాలు, నరాల్లో సమస్యను గుర్తించారు. రేడియాలజిస్టు రూపేష్ బృందం ఆధ్వర్యంలో గర్భసంచికి వెళ్లే ప్రధాన రక్తనాళాన్ని మూసివేసేందుకు ఎంబోలైజేషన్ చేసి రక్తస్రావాన్ని ఆపివేశారు. దీంతో రుతుక్రమం సరిగా ఉండకపోవడంతో పాటు గర్భం దాల్చే అవకాశాలు తక్కువ కావడంతో పాటు గర్భస్రావం అయ్యేందుకు ఎక్కువ అవకాశాలున్నాయి. ఏడాది పాటు ఆమెకు రుతుక్రమం ఆగిపోవడంతో మళ్లీ కిమ్స్‌కు రాగా గర్భసంచికి రక్తప్రసరణ జరిగేలా మందులు ఇచ్చి సమస్యను పరిష్కరించారు. డాప్లర్ స్టడీస్‌తో గర్భసంచి పొర పిండాన్ని మోయగలుగుతుందా అని పరిశీలించారు. ఆ తర్వాత ఆమె సహజంగానే గర్భం దాల్చగా పలు సమస్యలు తలెత్తాయి. కేవలం గర్భసంచికి మాత్రమే కాకుండా రక్తం పిండానికి అందాలి. దీని కోసం ఆమెకు రక్తాన్ని పలుచపరిచే మందులు, అందించి రక్తం పిండానికి చేరాలే చేశారు. 36 వారాల పాటు గర్భం నిలిచేలా పలు జాగ్రత్తలు తీసుకున్నారు. తల్లికి ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం, నేరుగా ప్రోటీన్లు అందించారు. సిజేరియన్ ద్వారా ఆమెకు ప్రసవం చేయగా 2.5 కిలోల బరువుతో బిడ్డకు జన్మనిచ్చింది. ఇలాంటి క్లిష్టమైన కేసులో తల్లిబిడ్డలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రాణాలు కాపాడటంతో పాటు బిడ్డకు జన్మనివ్వాలనే ఓ తల్లి కోరిక తీర్చినట్లు డాక్టర్ వసుంధర చీపురుపల్లి వివరించారు.

సీనియర్ సిటిజన్స్ సేవలు స్ఫూర్తిదాయకం

సనత్‌నగర్: సీనియర్ సిటిజన్స్ ఉన్నత సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకమని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి అన్నారు. సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా సుందర్‌నగర్‌కు చెందిన 97 ఏళ్ల రిటైర్డ్ ప్రొఫెసర్ సుబ్బయ్య, అమీర్‌పేటకు చెందిన 97 ఏళ్ల కొత్తపల్లి శకుంతలమ్మలను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా జేఎస్‌టీ శాయి మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ అనుభవాలు, వారి ఆరోగ్య రహస్యాలు నేటి తరానికి ఎంతగానో అవసరమన్నారు. సుబ్బారెడ్డి, వెంకటేశ్వరశర్మ, మధుసూదన్‌రావు, విజయలక్ష్మీ, టిల్లుభాయ్, దర్శన్‌సింగ్, ఉదయ్, సుధాకర్, పార్థసారథి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చిలకలగూడ: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం సదుమూరు గ్రామానికి చెందిన ఎస్ఎల్ చిన్నప్పన్ (48) రెండు దశాబ్దాల క్రితం నగరానికి వలసొచ్చి చిలకలగూడ కిందిబస్తీ బూస్ట్ ఛాయ్‌పాయింట్ గల్లీలో ఉంటూ వస్త్రాల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం భార్య మృతి చెందగా, కుమార్తె చిత్తూరులో ఉండగా, చిన్నప్పన్ ఒక్కడే ఉంటున్నాడు. చిలకలగూడ అన్నానగర్‌లో రెండిళ్ల మధ్య సన్నటి సందులో ఓ వ్యక్తి ఇరుక్కున్నట్లు స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బయటకు తీసి పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. తీవ్ర భయాందోళనకు గురై గుండెపోటుతో మరణించినట్లు భావిస్తున్నారు. తను నివసిస్తున్న ఇంటికి కిలో మీటరు దూరంలోని ఆ చిన్న సందులోకి చిన్నప్పన్ ఎందుకు, ఎలా వచ్చాడు. ఇంటిపై నుంచి సందులో పడ్డాడా, ఎందుకు భయాందోళనకు గురయ్యాడు, అదే ప్రాంతంలో రాత్రి 2 గంటల వరకు జరిగిన ఓ కార్యక్రమంలో భోజనం చేసేందుకు వచ్చాడా, ప్యాంట్ సగం వరకు ఎందుకు ఊడింది వంటి అంశాలపై పోలీసులు, క్లూస్‌టీం ఆరా తీస్తున్నారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఆరోగ్యం బాగలేకపోవడంతో ఊరికెళ్తానంటే రైలు టికెట్ కూడా బుక్ చేశామని, ఇంతలోనే అనుమానాస్పదంగా మృతి చెందడం మిస్టరీగా ఉందని బంధువులు తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలి మృతి

అడ్డగుట్ట: రైలులో ప్రయాణిస్తున్న ఓ వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందిన ఘటన జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ మాజీద్ వివరాల ప్రకారం.. లింగంపల్లికి చెందిన కూచి అనురాధ(58) తన కుమారుడు సురేష్ బాబుతో కలిసి విజయవాడకు వెళ్లేందుకు బుధవారం ఉదయం లింగంపల్లిలో రైలు ఎక్కారు. కొద్ది సేపటికి వృద్ధురాలు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు ఆగిన వెంటనే ప్లాట్‌ఫాం పైకి తీసుకురాగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు.

'తెలంగాణలో కుటుంబ పాలన'

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్‌లో బుధవారం కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రవీందర్ గౌడ్ పార్టీశ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ఉద్యమాలు, ఆందోళనలు, విద్యార్థులు, యువకుల బలిదానాలతో వచ్చిన తెలంగాణలో కుటుంబ పాలన సాగుతుందని ఆరోపించారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనుసూయ, సాగర్, అమీర్, రోషన్, ముస్తఫా, సోహిల్, ఖాజాఖాన్, అద్నం, కమల్‌రాజ్, మణిమాల, రవి, విజయ, మానస పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న రవీందర్ గౌడ్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలే..



సనత్‌నగర్: ఎన్నికల విధుల్లో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. సనత్‌నగర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కిషన్‌రావు వివిధ విభాగాల అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించి ఎన్నికల విధుల గురించి దిశానిర్దేశం చేశారు. బుధవారం ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్, వీడియో సర్వైలెన్స్, వీడియో వ్యూయింగ్ టీమ్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలతో సమావేశమయ్యారు. విధి నిర్వహణలో వారు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఈ సందర్భంగా కిషన్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికలను పారదర్శకంగా జరిగేలా అన్ని విభాగాల అధికారులు, రాజకీయ పార్టీల నేతలు సహకరించాలన్నారు. ఎన్నికల నియమావళిని అనుసరించి నడుచుకోవాలన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు తమకు అప్పగించిన విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ కోడ్ ఉల్లంఘనకు పాల్పడకుండా చూడాలన్నారు.

అలకబూనుతున్న నేతలు.. బుజ్జగిస్తున్న అభ్యర్థి

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్‌ఎస్‌లో గ్రూపు తగాదాలు తారస్థాయికి చేరాయి. బోర్డు మాజీ సభ్యులు, సాయన్న వర్గీయులు వేర్వేరు గ్రూపులుగా విడిపోవడం పార్టీ అభ్యర్థి లాస్య నందితకు తలనొప్పిగా మారింది. పార్టీ అభ్యర్థిగా ప్రకటించి 40 రోజులు అవుతున్నా, కనీసం నాలుగు రోజులు కూడా ప్రచారం చేయలేని దుస్థితి నెలకొంది. మొత్తానికి బోర్డు మాజీ సభ్యులు దారికి రాగా ఇటీవలే ప్రచారం మొదలుపెట్టారు. అయితే బోర్డు మాజీ సభ్యులకే ప్రాధాన్యం ఇస్తున్నారన్న నెపంతో సాయన్న వర్గీయులు అలక బూని లాస్య నందిత కార్యాలయానికి రావడం మానేశారు. బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ నేతృత్వంలో అసమ్మతి నేతలు బుధవారం మారేడుపల్లిలోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్లో ప్రత్యేకంగా భేటీ అయ్యి తమకు తగిన ప్రాధాన్యం ఇస్తే మినహా ప్రచారంలో పాల్గొనేది లేదని తీర్మానించారు. అసమ్మతి నేతల సమావేశం విషయం తెలుసుకున్న లాస్య నందిత వారికి నేరుగా ఫోన్ చేసి తన కార్యాలయానికి పిలిపించుకున్నారు. పార్టీ అధిష్ఠానం సూచనల మేరకు బోర్డు మాజీ సభ్యులతో పాటు అన్ని వర్గాలకు చెందిన నేతలను కలుపుకొనిపోవాల్సి ఉంటుందన్నారు. ఇకపై నిర్వహించే ప్రచార కార్యక్రమాల్లో పార్టీ నేతలందరికీ తగిన ప్రాధాన్యం ఉంటుందని సమాచార, సమన్వయ లోపం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

మారిన ఆర్‌ఓ కార్యాలయం..

సనత్‌నగర్: సనత్‌నగర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఈ సారి బేగంపేట సర్కిల్ కార్యాలయం భవనం మూడో అంతస్తులో ఏర్పాటు చేయడంతో అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్‌ఓ ఇక్కడి నుంచే విధులు నిర్వర్తించనున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాల స్వీకరణ, సమర్పణ ఇక్కడి ఆర్‌ఓ కార్యాలయంలోనే ఉంటుంది. ఆ తర్వాత నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు.. ఇలా ఎన్నికలకు సంబంధించిన వ్యవహారాలన్నీ ఈ కార్యాలయం కేంద్రంగానే జరుగుతాయి. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల వేళ..అమీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలోనే ఆర్‌ఓ కార్యాలయం ఏర్పాటు చేశారు.ఈ సారి ఆ స్థానాన్ని మార్చి బేగంపేట సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేయడం గమనార్హం.

ఎన్నికల అధికారులు వీరే..

రిటర్నింగ్ అధికారి
బీ.కిషన్‌రావు (హెచ్‌ఎండీఏ ఎస్టేట్ ఆఫీసర్)
ఫోన్: 7337055563

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు
ఎన్.శంకర్ (బేగంపేట డీఎంసీ)-91540 32866
బీమయ్యగౌడ్ (అమీర్‌పేట తహసీల్దార్) -944081 55872
క్రిస్టోఫర్ (టౌనప్లానింగ్ ఏసీపీ, బేగంపేట) -98482 88106
వీ కుమార్ (ఏఎంసీ బేగంపేట)-91000 91941

గుడి సేవాసులు.. పోలీసులయ్యారు

● కానిస్టేబుల్ ఫలితాల్లో సత్తాచాటిన సాయిబాబా హట్స్ వాసులు ● నలుగురు ఏఆర్.. ఒకరు ఫైర్ విభాగంలో ఎంపిక


తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెలువరించిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో తిరుమలగిరి సాయిబాబా హట్స్‌కు చెందిన ముగ్గురు యువకులు, ఇద్దరు యువతులు ఉద్యోగం సాధించారు. ఇందులో నలుగురు రెండు సార్లు విఫలం కాగా ఒకరు మొదటిసారి ప్రయత్నించి సఫలమయ్యారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కఠోర దీక్ష, అంకితభావంతో, అహర్నిశలు కష్టపడి చదివి ఉద్యోగాలు పొందారు ఒకే ప్రాంతానికి చెందిన ఐదుగురిలో నలుగురు ఏఆర్ కానిస్టేబుళ్లుగా ఒకరు ఫైర్ డిపార్ట్‌మెంట్‌లో ఒకేసారి ఉద్యోగాలు పొందడంతో సాయిబాబా హట్స్‌కు చెందిన బస్తీవాసులు వారికి అభినందనలు తెలుపుతున్నారు. పీఎస్ పరిధిలోని యువతి యువకులు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించడంతో తిరుమలగిరి సీఐ శేఖర్ వారిని అభినందించారు.

–రసూల్‌పురా

మొదటిసారి విఫలమైనా..



బీఎస్సీ ఎంఎస్‌సీఎస్ చదివిన ఎం చెన్నమ్మ 2018లో మొదటిసారి కానిస్టేబుల్ ఉద్యోగానికి ప్రయత్నించి మెరిట్‌లిస్ట్‌లో పేరు రాకపోవడంతో రెండోసారి దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఇనిస్టిట్యూట్‌లో కోచింగ్ తీసుకుని కానిస్టేబుల్ ఉద్యోగం సాధించింది. భర్త శివకుమార్, కుటుంబ సభ్యుల పోత్సాహంతో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యింది.



కారు డ్రైవర్‌గా పనిచేస్తునే..



తండ్రి గాంధీ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డు, తల్లి గృహిణి. బీకామ్ కంప్యూటర్స్ చదివిన కేబీ. చంద్రశేఖర్ 2016 కానిస్టేబుల్ ఉద్యోగానికి ప్రయత్నించి అర్హత పరీక్షలో విఫలమయ్యాడు. నిరాశ చెందకుండా కార్ఖానలోని ఓ వైద్యుడి వద్ద వ్యక్తిగత కారు డ్రైవర్‌గా పని చేస్తునే కానిస్టేబుల్ ఉద్యోగం కోసం అహర్నిశలు కష్టపడి చదివి ఏఆర్. కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు.

తల్లి ఆశయం నెరవేర్చాలని..



బీ.కామ్ జనరల్ చదివిన జి. విష్ణు 2016 2018లో కానిస్టేబుల్‌గా ప్రయత్నించి ప్రిలిమ్స్ వరకు వెళ్లి విఫలమయ్యాడు. అధిక బరువు ఉండడంతో ఎంపిక కాలేకపోయాడు. ఇటీవల జరిగిన ఎస్‌ఐ అర్హత పరీక్ష కూడా రాశాడు. కాగా కానిస్టేబుల్ ఉద్యోగానికి నోటికేషన్ వెలువడడంతో కరీంనగర్‌లో హాస్టల్లో ఉంటూ పట్టుదలతో చదివి ఫైర్ డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. తన తల్లికి తాను ఎస్‌ఐగా చూడాలని కోరిక ఉండేదని ఆమె మరణించిందని బతికి ఉంటే ఎంతో సంతోషపడేదని చెప్పుకొచ్చాడు.

భర్త ప్రోత్సాహంతో..



సాయిబాబా హట్స్‌కు చెందిన దండు నాగమణి లోతుకుంట వందన డిగ్రీ కళాశాలలో బీకామ్ కంప్యూటర్స్ చదివింది. 2016లో వనపర్తికి చెందిన దండు నరేష్‌తో వివాహం జరిగింది. వీరికి ఓ బాబు, పాప ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెలువరించడంతో భర్త ప్రోత్సాహంతో చదివి మొదటిసారి ఏఆర్. కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించింది.

సెల్స్, సర్వీస్ మెన్‌గా పనిచేస్తూ..



బీకామ్ కంప్యూటర్స్ చదివిన పి. రాజు 2016, 2018 లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ప్రయత్నించి రాత పరీక్షలో విఫలమయ్యాడు. తండ్రి మేస్త్రీగా రోజువారి కూలీ, తల్లి గృహిణి. రెండుసార్లు విఫలమైనా తాత్కాలికంగా వాటర్ ప్యూరిఫైర్ సెల్స్ అండ్ సర్వీస్‌లో ఉద్యోగం చేస్తూ ఈసారి ఏలాగైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివి ఏఆర్. కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు.